
డిజిటల్ ఆహ్వానం

- శుభకార్యాల ఆహ్వానాల్లో చోటు చేసుకుంటున్న మార్పులు
- స్మార్ట్‌గా ఇన్విటేషన్లు
- డిజిటల్ కార్డులతో పిలుపులు
- వీడియోలతో వాట్సాప్ మెసేజ్‌లు
- తగ్గిపోతున్న ప్రింటింగ్ కార్డుల సంస్కృతి



క్యూఆర్ కోడ్‌తో తయారు చేసిన డిజిటల్ వెడ్డింగ్ కార్డులు, ఏటీఎం వెడ్డింగ్ కార్డు

కర్నూలు కల్చరల్: ఆదోనికి చెందిన వెంకట్ కుమారుడు యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన తన కొడుకు వివాహానికి ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల్లోని బంధుమిత్రులకు ఆహ్వానం పంపేందుకు సన్నాహాలు చేపట్టారు. సమయం కేవలం రెండు వారాలు మాత్రమే ఉండటంతో అందరికీ పత్రికలు పంచేందుకు వీలు కాని పరిస్థితి. కుమారుడి సలహా మేరకు బెంగళూరుకు వెళ్లి క్యూర్ స్కానర్‌తో వీడియో వెడ్డింగ్ కార్డులు, ఏటీఎం తరహాలో డిజిటల్ కార్డులు డిజైన్ చేయించారు. కేవలం నిమిషాల వ్యవధిలోనే వాట్సాప్ ద్వారా బంధుమిత్రులకు ఆహ్వానం పలికేశారు. సరికొత్త ట్రెండ్‌తో అందించిన పెళ్లి పిలుపుపై ప్రతి ఒక్కరూ అభినందనలు కురిపించారు.

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వివాహ, శుభకార్యాలకు ఆహ్వానించే విధానం వినూత్నంగా మారింది. గతంలో వివాహాది శుభ కార్యాలకు బంధుమిత్రులను పిలవాలంటే కనీసం నెల రోజులు ముందుగా వెడ్డింగ్ కార్డులు ముద్రించి వ్యవయ ప్రయాసలకోర్చి గడప గడపకు వెళ్లి పంచాల్సి వచ్చేది. మారుతున్న కాలంతో పాటు అది కాస్తా ఫోన్ కాల్స్, మెసేజ్‌ల రూపంలోకి వచ్చేసింది. డిజిటల్ ప్రపంచంలోకి అడుగు పెట్టిన ఆధునిక యుగంలో ఆహ్వాన పత్రికలు వీడియో వెడ్డింగ్ కార్డుల రూపంలో హల్‌చల్ చేస్తున్నాయి. మరింత ముందుకు వెళ్లి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ వెడ్డింగ్ కార్డులు వచ్చేశాయి.

ఏటీఎం తరహాలో కార్డులు

పెళ్లికి బంధుమిత్రులను పిలిచేందుకు క్యూఆర్ కోడ్‌తో ప్రింట్ చేసిన ఏటీఎం తరహా కార్డులు ప్రస్తుతం మార్కెట్‌లో విస్తృతంగా వాడుకలో ఉన్నాయి. వీడియో వెడ్డింగ్ ఇన్విటేషన్స్‌తో పాటు ఉన్నతస్థాయి బంధుమిత్రుల కోసం విజిటింగ్ కార్డ్స్ రూపంలో ఉండే డిజిటల్ వెడ్డింగ్ కార్డులు పంపుతున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి మహా నగరాల్లో వీటి వినియోగం ఎక్కువైంది. ఏపీలో మాత్రం తొలిసారి పశ్చిమ గోదావరి జిల్లాలో ఓ కాంట్రాక్టర్ తన కుమారుడి వివాహం కోసం ఈ తరహా కార్డులను తయారు చేయించినట్లు చెబుతున్నారు. ఇందులో కార్డు పైభాగంలో వధూవరుల ఫొటో, పేర్లు, ఆహ్వానించేవారి పేర్లు, తల్లిదండ్రుల పేర్లు మాత్రమే ఉంటాయి. వెనుక భాగంలో క్యూఆర్ కోడ్ ముద్రించి ఉంటుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే వివాహానికి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయి. పెళ్లి మండపం అడ్రస్, లొకేషన్ మ్యాప్, పెళ్లి పత్రిక, విందు టైమింగ్స్, ముహూర్త సమయంతో పాటు సంప్రదించాల్సిన వధువు, వరుడి తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు ఉంటాయి.

ప్రింటింగ్ కార్డులపై తగ్గిన మోజు

వివాహ మహోత్సవంలో ప్రధాన భూమిక పోషించే వెడ్డింగ్ కార్డులు కాలానుగుణంగా రూపు మార్చుకుంటున్నాయి. బ్లాక్ అండ్ వైట్ కార్డులతో మొదలైన పెళ్లి పత్రికలు తర్వాత కలర్, యూవీ, లేజర్, ఫొటో ప్రింటింగ్, సౌండ్ సిస్టమ్ కార్డులుగా మారాయి. ఈ ట్రెండ్ కొంత కాలం కొనసాగింది. రూ.2 నుంచి రూ.20 వరకు ఒక్కో కార్డు ప్రింటింగ్ ధర ఉండేది. ప్రస్తుతం నయా ట్రెండ్ మొదలైంది. డిజిటల్ యుగంలో వీడియో వెడ్డింగ్ కార్డులు మార్కెట్‌ను శాసించాయి. ప్రస్తుతం క్యూఆర్ కోడ్ స్కానర్‌తో రూపొందించిన డిజిటల్ కార్డుల వైపు యువత మొగ్గు చూపుతోంది. దీంతో ప్రింటింగ్ ప్రెస్ దుకాణాలు వెలవెలబోతున్నాయి.

ప్రస్తుతం ఇదే ట్రెండ్

డిజిటల్ యుగంలో యువత బర్త్‌డే, ఎంగేజ్‌మెంట్, గ్రాడ్యుయేషన్, బేబీ షవర్, ఆఫ్ శారీ ఫంక్షన్స్, గృహప్రవేశాలు వంటి అన్ని శుభకార్యాలకు వీడియో కార్డుల ద్వారా ఆహ్వానాలను వాట్సాప్‌లో పంపుతున్నారు. ఇంటర్నెట్, కంప్యూటర్‌పై అవగాహన ఉన్న ప్రతి వ్యక్తి ఉచిత టెంప్లెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమకు నచ్చిన డిజైన్‌లలో ఆహ్వాన పత్రికలను తయారు చేసేస్తున్నారు. కరోనా తర్వాత ఆహ్వానాలను డిజిటల్ పద్ధతిలో పంపేందుకే ప్రజలు ఇష్టపడుతున్నారు.

ప్రింటింగ్ కార్డుల వాడకం బాగా తగ్గుతోంది



గతంలో వివాహాల సీజన్‌లో పెళ్లి కార్డుల ప్రింటింగ్‌కు బాగా డిమాండ్ ఉండేది. కుటుంబ ఆర్థిక స్థితిగతులను బట్టి విభిన్నమైన, వినూత్న రీతిలో కార్డులను ఎంచుకొని ప్రింట్ చేయించుకునేవారు. బిజినెస్ బాగా ఉండేది. ప్రతి ప్రింటింగ్ ప్రెస్ నిర్విరామంగా పని చేసేది. ప్రస్తు తం ఆ పరిస్థితి లేదు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు మాత్రం అడపాదడపా తక్కువ క్వాంటిటీతో పెళ్లి పత్రికల కోసం వస్తున్నారు. నామ కరణం, కేశఖండన, బర్త్‌డే, పుట్టి దట్టి, హాకీకా, పర్సనల్ వెడ్డింగ్ కార్డ్స్ లాంటివి పూర్తిగా తగ్గిపోయాయి. కేవలం ఫ్యామిలీ కార్డ్స్ మాత్రమే ఆర్డర్స్ వస్తున్నాయి. సుమారు 50 శాతానికి పైగా బిజినెస్ తగ్గింది. కంప్యూటర్ కాలం, డిజిటల్ హవా, ఆండ్రాయిడ్ ఫోన్లు రావడంతో ఆహ్వాన పత్రికలకు డిమాండ్ తగ్గింది.

– ఎం.కె.శ్రీనివాసులు,
కిరణ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, కర్నూలు

క్లుప్తంగా

తాగునీటి బావిలో క్లోరినేషన్


బావిలో క్లోరినేషన్ చేయిస్తున్న సర్పంచ్

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని మంచినీటి వనరుల్లో సర్పంచ్ పాండురంగన్న బుధవారం క్లోరినేషన్ పనులు చేయించారు. గ్రామంలోని మంచినీటి ట్యాంకులతో పాటు క్రిష్ణదొడ్డి రోడ్డులోని బావిలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. అదే విధంగా పారిశుద్ధ్య కూలీలతో గ్రామంలోని ప్రధాన వీధులను శుభ్రం చేయించారు. మురుగు కాలువల్లో పూడిక తీయించారు. అనంతరం గ్రామంలోని చెత్తను ఊరి చివరకు ట్రాక్టర్ ద్వారా తరలించారు.

సర్వర్ సమస్యతో ఆధార్ సేవలకు అంతరాయం


కోడుమూరు సచివాలయం-3లో ఆధార్ సేవల కోసం వేచివున్న ప్రజలు

కోడుమూరు రూరల్: కోడుమూరులోని గ్రామ సచివాలయం-3లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం సర్వర్ సమస్యతో పనిచేయలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వర్ సమస్యతో ఆధార్ నమోదు కార్యక్రమం ముందుకు సాగలేదు. ఒక్క ఆధార్ కార్డులో అప్‌డేట్ కూడా చేయలేక పోయారు. దీంతో ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం వచ్చిన ప్రజలు గంటల తరబడి ఎదురు చూసి విసుక్కుంటూ వెళ్లిపోయారు.

పంటల పరిశీలన


పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసరెడ్డి

కల్లూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏఓ శ్రీనివాసరెడ్డి బుధవారం పెద్దపాడు, కల్లూరులో పత్తి, కంది తదితర పంటలను పరిశీలించారు. పంటలో సస్య రక్షణ పాటిస్తే చిడపీడలను నివారించుకోవచ్చని రైతులకు సూచించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శ్రీలత, గిరీష్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ

కోడుమూరు రూరల్: సిబ్బంది పనివేళల్లో తప్పనిసరిగా గ్రామ సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని కోడుమూరు ఎంపీడీఓ రాముడు అన్నారు. బుధవారం కోడుమూరులోని గ్రామ సచివాలయం-3ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయ రికార్డులను, సిబ్బంది హాజరును పరిశీలించారు. కార్యాలయ వేళకు ప్రతి రోజు సిబ్బంది చేరుకోవాలని, వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను తెసుకుని పరిష్కరించాలని ఎంపీడీఓ సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమి స్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీఓ వెంటఈఓ అజయ్‌భాస్కర్ ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థినులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో శాంతిరాం ఆస్పత్రి వైద్యులు బుధవారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పాఠశాలలో 300 మంది విద్యార్థులకు రక్తపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు డాక్టర్ సురేష్ తెలిపారు. ఎస్ఓ లలితా, వైద్య సిబ్బంది రమణ, మూర్తి, సుబ్రమణ్యం, సురేంద్ర, అఖిల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి సకల జనుల మాత మహోత్సవాలు


సిద్ధమవుతున్న సకల జనుల మాత దేవాలయం

ఓర్వకల్లు: స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఏసుక్రీస్తుకు జన్మనిచ్చిన కన్య మరియమ్మ మహోత్సవాలు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని రెవరెండ్ పాస్టర్ ఆనందరాజు బుధవారం తెలిపారు. సోమవారం సాయంత్రం మేరిమాత పతాకావిష్కరణతో వేడుకలకు అంకురార్పణ చేస్తారని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అదుపుతప్పితే అంతే


ఆటోలో ప్రమాదకరంగా నిలబడి వెళ్తున్న మహిళలు

గడివేముల: పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులు, కూలీలు ప్రయాణిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. గడివేముల–నందికోట్కూరు రహదారిలో ఆటోలో పరిమితికి మించి కూలీలు ప్రయాణించడం బుధవారం సాక్షి కెమెరాకు కనిపించింది. ఇటీవల వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా ప్రజలకు అవగాహన రావడంలేదు. ఎన్నిసార్లు పోలీసులు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ఫలితం లేకుండా పోతోంది. ఆటో డ్రైవర్లు సైతం ఆదాయం చూసుకుంటున్నారే తప్ప ప్రజల ప్రాణాలను పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధుడు ఆత్మహత్యాయత్నం

సి.బెళగల్: కొందరు తిట్టడంతో మనస్తాపం చెందిన వృద్ధుడు ఆత్మహత్యకు యత్నించాడు. ఎస్ఐ తిమ్మారెడ్డి వివరాల మేరకు..మండలంలోని తిమ్మందొడ్డి గ్రామానికి చెందిన తెలుగు పెద్ద నరసన్న (65)తో అదే గ్రామానికి చెందిన నాగేష్, అతడి భార్య నరసమ్మ, గోవిందు, చిన్న తిమ్మయ్య, తెలుగు చిన్నారెడ్డి ఈ నెల 22వ తేదీ హమాలి డబ్బుల విషయంలో గొడవ పడ్డారు. పెద్ద నరసన్నతో పాటు ఆయన కుటుంబ సభ్యులు నరసమ్మ, మోహన్, వెంకటేశ్వరమ్మను కాళ్లతో తన్ని దాడి చేశారు. దీంతో మనస్తాపం చెందిన పెద్ద నరసన్న బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు అతన్ని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి కుమారుడు తెలుగు వెంకటరాముడు ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. కాగా బాధితుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, తదితరులు

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీనిపై ఆ పాఠశాల హెచ్ఎం నిర్మల వసంతకుమారి, ఎస్ఎంసీ చర్మన్ వెంకటేషన్, పీఈటీ సత్యకుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 22వ తేదీ కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో సైక్లింగ్, ఖోఖోలో 9వ తరగతి విద్యార్థినులు వీరేషమ్మ, ఇంద్రజ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలక ఎంపికయ్యారని తెలిపారు. అలాగే రగ్బీలో నవీన్ ఎంపికయ్యాడని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో సత్తాచాటి పాఠశాలకు మంచి పేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. బుధవారం విద్యార్థులను అభినందించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు


నిడ్జూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

కర్నూలు (రూరల్): వరిలో సస్యరక్షణ పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి మధుమతి అన్నారు. మండలంలోని మామిదాలపాడు, నిడ్జూరు గ్రామల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వరి పంటను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. నూతన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి పొందవచ్చని, వరి పంటలో ఎక్కువగా కాలి బాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పొట్ట దశలో ఉన్న వరి పంటలో కాటుక తెగులు వచ్చే అవకాశం ఉందని, నివారణకు హెక్సాకొనజల్ 2ఎంఎల్ లేదా ప్రోపికొనజల్–1 ఎంఎల్ లీటరు నీటికి పిచికారీ చేయాలని తెలిపారు. రసం పీల్చే పురుగులున్నాయని, నత్రజని ఎరువుల వాడకం తగ్గించాలని రైతులకు సూచించారు. ఎకరాకు 25 కిలోల చొప్పున పొటాష్ వాడాలని చెప్పారు. ఎప్పటికప్పుడు పంటలకు వ్యాపించే తెగుళ్లపై వ్యవసాయాధికారులను సంప్రదించి వారి సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు.

విచక్షణారహితంగా పురుగు మందులు వాడొద్దు


కంది సాగులో మెలకువలను వివరిస్తున్న ఏడీఏ సాలురెడ్డి, ఏఓ

కోడుమూరు రూరల్: రైతులు సాగు చేసిన పంటలకు విచక్షణారహితంగా ఎరువులు, పురుగుమందులను వాడరాదని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని అమడగుంట్ల గ్రామంలో ఏఓ రవిప్రకాష్‌తో కలిసి ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం నిర్వహించారు. పత్తి, కంది, పొగాకు పంటలపై రైతులకు సూచనలు చేశారు. కంది పంట మొగ్గ, పూత దశలో ఉన్నందున రైతులు ప్రతి రోజు పంటను పరిశీలిస్తూ ఉండాలన్నారు. ప్రస్తుతం కందిపంటకు గూడుపురుగు సోకుతున్న నేపథ్యంలో రైతులు పురుగు నివారణ కోసం నువ్వల్ నురాన్ మందును వేపనూనెతో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే పత్తిలో కాయ పూత బలంగా వచ్చేందుకు 14-0-35ను లీటర్ నీటికి 10గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలని ఏడీఏ తెలిపారు. వర్షాలకు పొగాకుకు కుళ్లు తెగులు సోకే అవకాశమున్నందున రైతులంతా సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పంటలకు మందులు అవసరమైతే తప్ప ఉపయోగించరాదని, పోటీ పడి ఎరువులు, మందులను వాడితే పంటలు దెబ్బతింటాయని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓ శశిధర్ రెడ్డి, డాట్ శాస్త్రవేత్త కిశోర్ కుమార్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మెలకువలు పాటించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

సి.బెళగల్: వ్యవసాయంలో సస్యరక్షణ పద్ధతులు పాటించి అధిక దిగుబడులను పొందాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ అన్నారు. బుధవారం వ్యవసాయ సిబ్బందితో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉదయం బురాన్‌దొడ్డి గ్రామ రైతు సేవా కేంద్రం, మధ్యాహ్నం గొల్లలదొడ్డి గ్రామ సచివాలయంలో రైతులకు అవగాహన కల్పించారు. సాగులో సస్యరక్షణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ తదితర విషయాలను వివరించారు. పంటల్లో చీడ పురుగుల ఉధృతిని తెలుసుకునేందుకు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈపీఈఓ వెంకటేష్, వీఏఏ మారెప్ప, శశికాంత్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎస్సీ హాస్టల్ భవనం


పెచ్చులూడిన హాస్టల్ పైకప్పు

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలో ఉన్న ఎస్సీ ప్రభుత్వ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. హాస్టల్ భవనంలోని గదులు పెచ్చులూడి కింద పడుతున్నాయి. గదులన్నీ బీటలు వారిపోయాయి. ఈ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో హాస్టల్ భవనం మరింత దెబ్బతింది. దాదాపు 50 సంవత్సరాల నాటి భవనం ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. ఈ విషయంపై హాస్టల్ వార్డెన్ మదారిని బుధవారం వివరణ కోరగా ఎస్సీ హాస్టల్ భవనం గదులు విద్యార్థులు ఉండడానికి చాలా ఇబ్బందిగా ఉందని, 3 నుంచి 9 తరగతి వరకు వంద మంది విద్యార్థులు ఈ హాస్టల్‌లో ఉంటున్నారని తెలిపారు. జులై 7వ తేదీ నుంచి హాస్టల్ విద్యార్థులను పక్కనే ఉన్న జిల్లాపరిషత్ హైస్కూల్‌లోకి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్చామన్నారు. వంద మంది విద్యార్థులకు స్కూల్‌లో ఉన్న నాలుగు గదులను ఆరు నెలలకు పర్మిషన్ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం ఈ ఆరు నెలల కాలంలో నూతన భవనం నిర్మాణానికి ఏర్పాటు చేస్తే విద్యార్థులకు కష్టాలు తీరుతాయని ఆయన తెలిపారు.


నెర్రలిచ్చిన గోడలు

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



గ్రామ సభలో మాట్లాడుతున్న జేసీ నవ్య

కోడుమూరు రూరల్: రీసర్వేలో భాగంగా వచ్చిన భూసమస్యలను పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య తెలిపారు. బుధవారం గూడూరు మండలం కె.నాగలాపురం గ్రామంలో తహసీల్దార్ రామాంజినేయులు ఆధ్వర్యంలో రీసర్వే భూసమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ నవ్య రైతులతో మాట్లాడారు. రీసర్వేలో భాగంగా వచ్చిన భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహిస్తోందన్నారు. సమస్యలున్న రైతులంతా ముందుకొచ్చి అర్జీలిస్తే అధికారులు వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నైయోమి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వరరెడ్డి, మండల సర్వేయర్ బాలు నాయక్ పాల్గొన్నారు.

ముడుమలగుర్తి గ్రామంలో..

రీసర్వేలో నెలకొన్న భూసమస్యల పరిష్కారం కోసం కోడుమూరు మండలం ముడుమలగుర్తి గ్రామంలో తహసీల్దార్ వెంకటేష్ నాయక్ గ్రామ సభ నిర్వహించారు. గ్రామానికి చెందిన 62మంది సమస్యలపై తహసీల్దార్‌కు అర్జీలిచ్చారు. రీసర్వే డీటీ క్రిష్ణమూర్తి, మండల సర్వేయర్ సునీల్, గ్రామ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాణ్యం: గ్రామ సభల్లో రైతులు భూసమస్యలను పరిష్కరించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌రెడ్డి అన్నారు. అనుపూరు గ్రామంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి వచ్చే వినతులను విచారించి పరిష్కారం చూపుతామని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్ఐ రామ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పాణ్యం: మాట్లాడుతున్న డీటీ శివశంకర్‌రెడ్డి


ఓర్వకల్లు: మాట్లాడుతున్న తహసీల్దార్ విద్యాసాగర్

భూసమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

ఓర్వకల్లు: రైతులకు తలెత్తిన భూ సమస్యలను పరిష్కరించడానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విద్యాసాగర్ అన్నారు. బుధవారం మండలంలోని హుసేనాపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ అధ్యక్షతన జరిగిన సభకు తహసీల్దార్ విద్యాసాగర్, రీసర్వే డీటీ శర్మిలారెడ్డి, మండల సర్వేయర్ శంకర్‌మాణిక్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గ్రామంలో చాలా మంది రైతులు విస్తీర్ణంలో తగ్గ దల, కొలతల్లో వ్యత్యాసాలు, అన్నదమ్ముల మధ్య భాగపరిష్కారాల విషయంలో విబేధాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. సుమారు 71 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ సమస్యలను 45 రోజుల్లోగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

బురాన్‌దొడ్డిలో గ్రామ సభ

సి.బెళగల్: మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను మండల ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం బురాన్‌దొడ్డి గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన 65 మంది రైతులు వినతిపత్రాలు అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు పాల్గొన్నారు.

కందిలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

ఓర్వకల్లు: రైతులు సాగు చేసిన కంది పంటలో శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని వ్యవసాయాధికారి సుధాకర్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కొమరోలు గ్రామంలో రైతులకు క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ముందుగా రైతులు సాగు చేసిన కంది పంటలను పరిశీలించారు. కందిలో లేత ఆకులు, పూత, పిందెలు, కాయలను కలిపి పురుగులు గూడుగా చేసుకుని అందులో లోపలి పదార్థాలను తినివేయడం గుర్తించినట్లు తెలిపారు. తద్వారా పంట దిగుబడి తగ్గుతుందన్నారు. దీని నివారణకు 1 మి.లీ ఇండక్షికార్బ్ లేదా 1.5 గ్రాములు ఎపిసేట్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ–క్రాప్ జాబితాను అన్ని రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శించామని తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే గురువారంలోగా రైతు సేవా కేంద్రాల్లో సరి చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామచంద్రుడు, ఏఈఓ భాస్కర్ పాల్గొన్నారు.

నిరంతర విద్యపై అవగాహన

పాణ్యం: మండల కేంద్రంలోని పొదుపు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఏఏలకు నిరంతర విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఈఓంట కోటయ్య మాట్లాడుతూ..మండలానికి 100 మందిని లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామం నుంచి 30 మంది నిరక్షరాస్యులను గుర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. గ్రామాల్లో అక్షరాస్యత పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ, ఏపీఎం ప్రసాద్, ఏఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం


ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కోడుమూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి పిలుపునిచ్చారు. నవంబర్ 12,13వ తేదీల్లో ఆదోనిలో జరిగే ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభల వాల్ పోస్టర్లను మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ.. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టళ్ల సమస్యలను ప్రభుత్వం గాలికొదిలేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు శాపంగా మారిన జీఓ నం.77ను వెంటనే రద్దు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలకు విద్యార్థులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని రంగస్వామి కోరారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు అల్తాఫ్, వీరేంద్ర, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

పొంచివున్న ప్రమాదం


కోడుమూరు బాలికల హైస్కూల్‌లో దెబ్బతిన్న మెట్ల సైడ్ వాల్

కోడుమూరు రూరల్: కోడుమూరులోని బాలికల హైస్కూల్ మొదటి అంతస్తులో ఉండే తరగతి గదులకు వెళ్లేందుకు ఉన్న మెట్లకు నిర్మించిన సైడ్ వాల్ పూర్తిగా దెబ్బతింది. సైడ్‌వాల్‌కు వేసిన కడ్డీలు పూర్తిగా తుప్పు పట్టడంతో పాటు సిమెంట్ పెచ్చులన్నీ ఊడిపడుతున్నాయి. దీంతో విద్యార్థినులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళనతో ఉపాధ్యాయులు భయంభయంగా ఉంటున్నారు. సైడ్‌వాల్ పడిపోతున్న విషయాన్ని హెచ్ఎం నాగరాజకుమారి మండల ఇంజినీరింగ్ అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా వారు ఇంతవరకు మరమ్మతు పనులు చేపట్టలేదు. దీంతో పాఠశాల సమయంలో టీచర్లు ఎవరో ఒకరు మెట్ల వద్ద ఉండి విద్యార్థినులను గోడవైపు రాకుండా చూసుకుంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మెట్లకున్న సైడ్‌వాల్‌ను పూర్తిగా తొలగించి కొత్తది నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

పాము కాటుపై అవగాహన

కర్నూలు కల్చరల్: కేంద్రీయ విద్యాలయంలో బుధవారం పాము కాటుపై అవగాహన కార్యక్రమం జరిగింది. సంఘమిత్ర యానిమల్ ఫౌండేషన్ సభ్యులు మొహమ్మద్ ఇద్రిస్ అవగాహన కల్పించారు. పాము కనపడగానే అక్కడి నుంచి దూరంగా వెళ్లిపోవాలన్నారు. రాత్రి పూట తప్పక టార్చ్ లైట్‌ను వాడాలన్నారు. నేలపై నిదురించే వారు దోమ తెరలను వాడాలని సూచించారు.